క్లుప్తంగా

శుభకార్యం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఉషశ్రీచరణ్

పెనుకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ నాయకుడు సత్తారుపల్లి మారుతిరెడ్డి కుమార్తె అశ్విని - విజయభాస్కర్‌రెడ్డి వివాహ వేడుకల పట్టణంలోని గోల్డెన్ ఎంపైర్ ఫంక్షన్ హాల్ జరిగింది. ఆదివారం ఈ వివాహ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీకి చెందిన ఇస్లాపురం గ్రామంలో బాధిత కుటుంబాన్ని మంత్రి సవిత ఆదివారం పరామర్శించారు. ఆ గ్రామానికి చెందిన నాగరాజు, రాధమ్మ కుమారుడు నిఖిల్ (13) రెండు రోజులక్రితం ప్రైవేట్ బస్ ప్రమాదంలో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబం ఇంటికి వెళ్లిన మంత్రి వారిని ఓదార్చారు. కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

మండల కమిటీ ఏకగ్రీవం

లేపాక్షి: హిందూపురం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఉదయం లేపాక్షి మండల ఏపీయూడబ్ల్యూజే కమిటీని జిల్లా అధ్యక్షుడు పుల్లయ్య ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కట్టా శశాంక్, ప్రధాన కార్యదర్శి సందీప్, కార్యదర్శి నవీన్‌కుమార్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా ఆనందప్పను ఎన్నుకున్నారు. మండల కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక కావడంపై మండల విలేకరులు కృతజ్ఞతలు తెలిపారు.


విద్యతోనే పేదరిక నిర్మూలన



వేడుకలను ప్రారంభిస్తున్న దృశ్యం

పావగడ: విద్యను అభ్యసించడంతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని మైసూరు కమిషనర్ రఘునందన్ పేర్కొన్నారు. స్థానిక శ్రీశాల పాఠశాల ఆవరణంలో ఆదివారం నిర్వహించిన కార్తీక వన భోజన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేవలం డాక్టర్లు, ఇంజినీర్లే కాకుండా పది మందికి సేవలందించే ఉద్యోగాలు పొందాలన్నారు. కార్యక్రమంలో వందలాది మంది విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



మడకశిరరూరల్: మండల పరిధిలోని నీలకంఠాపురంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో మాజీ ఎంపీ, స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్గీయ శ్రీరామరెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం చండీహోమం నిర్వహించారు. పురోహితులు వేకువ జాము నుంచి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం లోక కల్యాణాన్ని ఆకాంక్షిస్తూ చండీ హోమం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ రఘువీరారెడ్డి కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రవచనాలు ప్రారంభం

మడకశిర: పట్టణంలోని యాదవ కల్యాణ మండపంలో ఆదివారం వేణుగోపాలశర్మ ఆధ్వర్యంలో ప్రవచనాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగిన కార్యక్రమంలో తొలిరోజు ఆదివారం అయ్యప్పస్వామి జననం, దీక్షాపద్ధతులు, ఫలితంపై ప్రవచనాలు చేశారు. సోమవారం విష్ణు వైభవం, మంగళవారం శివ వైభవంపై ప్రవచనాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. రోజూ సాయంత్రం 5.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

మారెమ్మకు ప్రత్యేక పూజలు



అమరాపురం: మండల పరిధిలోని వీ అగ్రహారంలో వెలసిన తప్పద మారెమ్మకు ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు జ్యోతులతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకొని ప్రదక్షిణలు చేశారు. తర్వాత మారెమ్మకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

పట్టు రైతులకు ఊరట



బైవోల్టిన్ పట్టుగూళ్ల ధరలు పెరగడంతో పట్టు రైతులు లాభాల బాట పట్టారు. ఎన్నడూలేని విధంగా నెల రోజుల నుంచి పట్టుగూళ్ల ధరలు ఆశించిన స్థాయిలో కొనసాగుతుండటంతో రైతులు ఆర్థికంగా ఎదగడానికి అవకాశం ఏర్పడింది.

- పెరిగిన బైవోల్టిన్ పట్టుగూళ్ల ధరలు
- కేజీ పట్టుగూళ్ల ధర రూ.600పైగా పలుకుతున్న వైనం
- ప్రభుత్వం ప్రోత్సాహకం అందించాలని కోరుతున్న రైతులు

మడకశిర: జిల్లాలోనే బైవోల్టిన్ పట్టుగూళ్ల ఉత్పత్తిలో మడకశిర నియోజకవర్గం రైతులు మొదటి స్థానంలో ఉన్నారు. ఈ ప్రాంతంలోనే దాదాపు 10 వేల ఎకరాల విస్తీర్ణంలో మల్బరీ తోటలు విస్తరించి ఉన్నాయి. 14 వేల మంది రైతులు మల్బరీ తోటలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఇలాంటి పరిస్థితిలో బైవోల్టిన్ పట్టుగూళ్ల ధరలు నెల రోజుల నుంచి భారీగా పెరగడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రూ.600పైగా ధర

ప్రస్తుతం మార్కెట్లలో బైవోల్టిన్ పట్టుగూళ్ల ధర కేజీ రూ.600పై గానే పలుకుతోంది. ఇదే ధర నెల రోజుల నుంచి నిలకడగానే కొనసాగుతోంది. గతంలో ఎన్నడూలేని విధంగా పట్టుగూళ్ల ధరలు పెరగడంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది. రాష్ట్రంలోనే పట్టుగూళ్లకు ప్రధాన మార్కెట్ హిందూపురం. ఈ మార్కెట్‌లో పట్టుగూళ్ల ధరలు నెల రోజుల నుంచి రూ.600పైగానే పలుకుతుండటంతో రైతులు ఆర్థికంగా లబ్ధిపొందు తున్నారు. ఇదిలా ఉండగా నెల రోజుల క్రితం పట్టుగూళ్ల ధరలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు నష్టపోయారు. అయితే ఈధరలు పెరగడంతో పట్టు రైతులకు మళ్లీ మంచి రోజులు వచ్చాయి.

కర్ణాటక మార్కెట్లలోనూ...

మడకశిర నియోజకవర్గంలోని పట్టు రైతులు ఎక్కువగా పట్టుగూళ్లను హిందూపురంతో పాటు కర్ణాటకలోని మార్కెట్లకు తరలించి అమ్ముకుంటున్నారు. కర్ణాటకు చెందిన రామనగర్ పట్టుగూళ్ల మార్కెట్ దేశంలోనే ప్రసిద్ధి. మడకశిర ప్రాంతంలోని రైతులు రామనగర్ మార్కెట్‌లో కూడా పట్టుగూళ్లను అమ్ముకుంటారు. రామనగర్ మార్కెట్‌లో కూడా పట్టుగూళ్ల ధరలు బాగానే ఉన్నాయి. ఈ మార్కెట్‌లో కేజీ బైవోల్టిన్ పట్టుగూళ్ల ధర రూ.700పైగానే పలుకుతోంది. ఇక్కడికన్నా రామనగర్‌లో కేజీపై రూ.100 అదనంగా లభిస్తోంది. దీంతో మడకశిర ప్రాంతంలోని పట్టు రైతులు రామనగర్‌కు కూడా తరలించి పట్టుగూళ్లను అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఏదిఏమైనా పట్టుగూళ్ల ధరలు పెరగడంతో నియోజకవర్గంలోని పట్టు రైతులు ఆనందం వ్యక్తమవుతోంది.

ప్రధాన మార్కెట్లలో పది రోజులుగా కేజీ బైవోల్టిన్ పట్టుగూళ్ల ధరలు ఇలా..

తేదీ	హిందూపురం	రామనగర్ (కర్ణాటక)
14న	రూ.665	రూ.715
16న	రూ.634	రూ.718
18న	రూ.626	రూ.750
20న	రూ.635	రూ.648
21న	రూ.669	రూ.760

ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించాలి



పట్టుగూళ్ల ధరలు పెరగడం కొంత వరకు ఊరటగా భావిస్తున్నా. ఈ ధరలు ఇలాగే కొనసాగితే లాభదాయకంగా ఉంటుంది. కొన్ని రోజుల తర్వాత ఈ ధరలు తగ్గుముఖం పడితే ఎలాంటి ఉపయోగమూ ఉండదు. ప్రభుత్వం పట్టుగూళ్ల ధరలు నిలకడగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం పూర్తిస్థాయిలో పట్టు రైతులకు ప్రోత్సాహం అందించి ఆదుకోవాలి. అప్పుడే పట్టు రైతులు బాగుపడడానికి అవకాశం ఉంటుంది.

– సన్నమారప్ప, కొత్తపాళ్యం, రొళ్ల మండలం

ధరలు బాగానే ఉన్నాయి



పట్టుగూళ్ల ధరలు బాగానే ఉన్నాయి. అయితే ప్రభుత్వ ప్రోత్సాహం కరువైంది. బైవోల్టిన్ రైతులకు కేజీ పట్టుగూళ్లపై ప్రభుత్వం అందించే రూ.50 ప్రోత్సాహకం ఇంత వరకూ రాలేదు. ప్రభుత్వం మంజూరు చేసి పట్టు రైతులను ఆదుకోవాలి. పట్టు రైతులకు రూ.కోట్లల్లో ప్రోత్సాహక ధనం రావాల్సి ఉంది. వెంటనే ప్రభుత్వం ఆ డబ్బు విడుదల చేయాలి.

– కెంచప్ప, మద్దనకుంట, అమరాపురం మండలం

ధరలు పడిపోకుండా చర్యలు చేపట్టాలి



ప్రస్తుతం పెరిగిన పట్టుగూళ్ల ధరలతో రైతులు ఆర్థికంగా ఎదగడానికి అవకాశం ఏర్పడింది. గతంలో కొన్నేళ్ల పాటు పట్టుగూళ్లకు ధరలు లేక రైతులు నష్టపోయారు. అయితే నెల రోజుల నుంచి మాత్రమే ధరలు పెరిగాయి. ఈ ధరలు ఇలాగే ఉంటాయనే నమ్మకం లేదు. ప్రస్తుతం ఉన్న పట్టుగూళ్ల ధరలు పడిపోకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– సోమకుమార్, పట్టు రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు, మడకశిర

'రెడ్లు' అన్ని రంగాల్లో రాణించాలి



కార్తీక వనభోజనాలకు హాజరైన రెడ్డి సామాజిక వర్గం ప్రజలు

చిలమత్తూరు: రెడ్డి సామాజిక వర్గం ఐక్యతగా మెలగాలని రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని టేకులోడు అటవీ ప్రాంతంలోని పడకలపల్లి మారెమ్మ దేవాలయం వద్ద రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రెడ్లు అన్ని రంగాల్లోనూ రాణించాలని, ప్రస్తుత పోటీ ప్రపంచంలో రెడ్లు ప్రగతి సాధించాలంటే తమ పిల్లలకు మెరుగైన విద్యను అందించాలని సూచించారు. వ్యవసాయ రంగంలో రెడ్ల పాత్ర కీలకమని చెప్పారు. పంటల సాగులో మెరుగైన మెలకవలు పాటించి లాభాలు గడించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన 600 మంది హాజరయ్యారు.

ప్రత్యేక ఓటరు నమోదుకు ఐదు దరఖాస్తులు

లేపాక్షి: మండల వ్యాప్తంగా అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఆదివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఫారం-6కు 5 దరఖాస్తులు అందినట్లు తహసీల్దార్ సౌజన్య లక్ష్మి తెలిపారు.

రొళ్లలో ...

రొళ్ల: మండల వ్యాప్తంగా 32 పోలింగ్ బూత్ కేంద్రాల పరిధిలోని 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండనున్న యువతీయువకులు ఓటరు జాబితాలోకి కొత్తగా చేరడం కోసం బీఎల్‌ఓలను సంప్రదించి దరఖాస్తులు చేసుకోవాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి పేర్కొన్నారు. ఆదివారం అన్ని పోలింగ్ బూత్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఫారం-6 కోసం 3, ఫారం-8 కోసం 3 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఓటరు జాబితాలో పేర్లు మార్పు, చేర్పులు ఏమైన ఉంటే సరి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

రూరల్ లీగ్‌కు యునైటెట్ ఫుట్‌బాల్ జట్లు



రూరల్ లీగ్‌కు అర్హత సాధించిన యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ జట్లు

హిందూపురం టౌన్: ఆర్‌డీటీ రూరల్ ఫుట్‌బాల్ లీగ్ అండర్-14, అండర్-12 బాలుర పోటీల్లో హిందూపురం యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ ప్రథమ స్థానంలో నిలిచి అర్హత సాధించింది. ఆదివారం ఫుట్‌బాల్ లీగ్‌లో భాగంగా స్థానిక ఎంజీఎం క్రీడామైదానంలో టేబుల్ టాప్ డిసైడింగ్ మ్యాచ్‌ను నిర్వహించారు. పోటీలకు అతిథిగా హైకోర్ట్ జీపీ, హిందూపురం ఫుట్‌బాల్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ అశ్వర్థనారాయణ, జిల్లా ఫుట్‌బాల్ సంఘం కోశాధికారి శేఖర్ పాల్గొన్నారు. హిందూపురం టౌన్ ఫుట్‌బాల్ క్లబ్ పై హిందూపురం యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్, పరిగి నార్త్ ఫుట్‌బాల్ క్లబ్‌పై హిందూపురం యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ విజయం సాధించాయి. అండర్-12, 14 రెండు విభాగాల్లో ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలవడంతో యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్ రూరల్ లీగ్‌కు అర్హత సాధించింది.

ఎన్‌సీసీతో పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసం



మార్చ్ ఫాస్ట్ చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎస్‌డీజీఎస్ కళాశాలలో 76వ ఎన్‌సీసీ దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల జాయింట్ సెక్రటరీ దాసా గంగాధర్ ఎన్‌సీసీ జెండాను ఆవిష్కరించారు. ఎన్‌సీసీ విద్యార్థుల పరేడ్‌ను తిలకించి, గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దేశ భద్రతకు సంబంధించిన భవిష్యత్ కాలం అవసరాలను అనుసరించి విద్యార్థి దశలో ప్రతి విద్యార్థి ఎన్‌సీసీ, ఎస్ఎస్ఎస్ లాంటి శిక్షణలను పొందాలన్నారు. క్రమశిక్షణకు మారుపేరైన ఎన్‌సీసీ శిక్షణలో విద్యార్థులు పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసాన్ని పొందుతారని పేర్కొన్నారు. తద్వారా మంచి పౌరులుగా ఎదుగుతారన్నారు. ప్రభుత్వాలు దీనిపై చొరవ చూపి అన్ని పాఠశాలలు, కళాశాలల్లో ఎన్‌సీసీను తప్పనిసరి చేయాలన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో మాదిరిగానే ప్రైవేటు సంస్థల్లో చదువుతున్న విద్యార్థులు కూడా ఎన్‌సీసీలో శిక్షణ పొందేలా ప్రోత్సహించాలని కోరారు. ఎన్‌సీసీ ద్వారా ఉద్యోగ ప్రయత్నాల్లో ప్రాధాన్యత లభిస్తుందని, దేశ రక్షణ దళాల్లో చేరడానికి మార్గం సుగమవుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు జేఎస్‌వీఎస్ ప్రసాద్, నాగేంద్రకుమార్, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ఫణీంద్ర, ఎన్ఎస్ఎస్ అధికారి రాజన్న, పీడీ హేమంత్, అధ్యాపకులు పాల్గొన్నారు.



34 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

మడకశిర: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1989-90 విద్యా సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొన్నారు. స్థానిక సరస్వతీ విద్యామందిరంలో సింహగిరి స్నేహితుల ట్రస్ట్ ఆధ్వర్యంలో వారందరూ కలిసి తమ కష్ట సుఖాలను తెలుసుకున్నారు. సేవా కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు.

డ్రోన్ కెమెరాలతో నిఘా



డ్రోన్ కెమెరాతో పట్టణ శివారులో నిఘా ఇలా..

హిందూపురం: పట్టణ శివారు ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు టూటౌన్ సీఐ కరీం తెలిపారు. ఎస్పీ వి.రత్న ఆదేశాలతో డ్రోన్ నిఘా ఉంటుందన్నారు. ఈ మేరకు ఆదివారం డ్రోన్ కెమెరాలతో ట్రయిల్ రన్ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాలాల్లో మద్యం సేవించడం, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా విస్తృతం చేయనున్నట్లు వివరించారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం



గుడిబండ పోలీసు స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

గుడిబండ/అగళి/రొళ్ల: శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు పోలీసు సిబ్బందికి సూచించారు. ఆదివారం సాయంత్రం రొళ్ల, గుడిబండ, అగళి పోలీసుస్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. ఇందులో భాగంగానే రికార్డులను పరిశీలించి పెండింగ్‌లో ఉన్న కేసులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామాల్లో అక్రమ ఇసుక, మద్యంతో పాటు గుట్కా వంటివి రవాణా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జూదం, మట్కా వంటి జరకుండా అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. సిబ్బంది గ్రామాల్లో రాత్రి వేళల్లో గస్తి తిరగాలన్నారు. రోడ్డు నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. మడకశిర రూరల్ సీఐ రాజ్‌కుమార్, ఎస్ఐలు మునిప్రతాప్, ఎస్ఐ వీరేష్, ఇన్‌చార్జ్ ఎస్ఐ బాలాజీ, ఏఎస్ఐ శ్రీరాములు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కార్మికుడికి తీవ్ర గాయాలు

సోమందేపల్లి: మండలంలోని చాలకూరు గ్రామ సమీపంలో ఉన్న అడాప్ట్ ఆటో కంపోనెంట్ పరిశ్రమలో యూపీకి చెందిన సూరజ్‌గోస్వామి అనే కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. శనివారం రాత్రి కంపెనీలో విధులు నిర్వహిస్తున్న బాధితుడికి యంత్రం కాళ్లకు తాకడంతో తొడ భాగంలో తీవ్ర గాయమైంది. దీంతో తనను ఆస్పత్రికి తీసుకువెళ్లమని హాహాకారాలు చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. మరో కార్మికుడికి గాయాలు కాగా ఇద్దరిని ఆలస్యంగా పరిశ్రమ సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. కాగా తరచూ ఈ కంపెనీలో కార్మికులు ప్రమాదాల బారిన పడుతున్నా తగిన జాగ్రత్తలు తీసుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు. అయితే ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని సోమందేపల్లి పోలీసులు తెలిపారు.

పెనుకొండలో బాలుడు...

పెనుకొండ: పెనుకొండ నగర పంచాయతీ పరిధిలోని తిమ్మాపురం గ్రామం వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వంశీకృష్ణ (8) అనే బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన కిష్టప్ప కుమారుడు రోడ్డు దాటుతుండగా కొత్తచెరువు వైపు నుంచి వచ్చిన ఆర్టీసీ బస్ ఢీకొనడంతో బాలుడికి తీవ్రగాయాలయ్యాయి. స్థానిక ప్రభుత్వాస్పత్రికిలో ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం వైద్యుల సూచనమేరకు అనంతపురం తరలించారు.

నేడు బలిజ కులస్తుల సమావేశం

పెనుకొండ: కార్తీక మాసం సందర్భంగా వన భోజన కార్యక్రమంపై చర్చించేందుకు సోమవారం సాయంత్రం 6 గంటలకు తోటగేరిలోని ఆంజనేయస్వామి ఆలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు బలిజ సంఘం నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. బలిజ కులస్తులు తప్పక హాజరుకావాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

రొద్దం: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. 500 మందికిపైగా రోగులను శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారని సామాజిక సేవాకర్త దొంతి లక్ష్మీనారాయణ తెలిపారు.

పెనుకొండ: పట్టణంలోని ఘనగిరి ఉన్నత పాఠశాలలో ఆదివారం జేవీవీ ఆధ్వర్యంలో మూర్ఛ వ్యాధి చికిత్సా శిబిరం నిర్వహించారు. 25 మంది వ్యాధిగ్రస్తులు పాల్గొనగా వైద్యులు రోహిల్ వారికి చికిత్సనందించారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి ప్రజా పరిష్కర వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ షేక్షావలి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో విన్నవించుకోవాలని సూచించారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

హిందూపురం: హిందూపురం టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ బాధిత టైలర్స్ కుటుంబ సభ్యులకు ఆదివారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో టైలర్ వృత్తినే నమ్ముకొని జీవనం సాగిస్తున్న 350 కుటుంబాలకు నిత్యావసరాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా టైలర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ షేక్ రఫీక్, వైస్ ప్రెసిడెంట్ జాఫర్, హిందూపురం ప్రెసిడెంట్ డైమండ్ జబీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

జనవరి 5న హైందవ శంఖారావం

హిందూపురం టౌన్: హిందూ దేవాలయాల పరిరక్షణకై విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న విజయవాడలో చేపట్టిన హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని శ్రీవ్యాసరాయ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. ఆదివారం మోడల్‌కాలనీలోని వ్యాసరాయ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో హైందవ శంఖారావం కార్యక్రమంలో భాగంగా చలో విజయవాడ కరపత్రాలను విడుదల చేశారు. ఆలయ ధర్మకర్త రమేష్‌రెడ్డి, నారాయణ, ఆచారి, చంద్రశేఖర్, మల్లికార్జున్, రవితేజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి రైల్వేఎల్‌సీ గేట్ మూసివేత

హిందూపురం: హిందూపురం రైల్వేసబ్‌డివిజన్ పరిధిలోని దేవరపల్లి వద్ద ఉన్న ఎల్‌సీ గేట్‌ను పర్మినెంట్‌గా మూసివేసినట్లు హిందూపురం రైల్వే ఏడీఇఎన్ కె.రామ్మోహన్‌రావు తెలిపారు. రైల్వే ట్రాక్ కింద అండర్ బ్రిడ్జి నిర్మాణం పూర్తవడంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని కలిపి గ్రామంలో ఆదివారం నరసింహమూర్తి అనే వ్యక్తి వద్ద నుంచి 35 కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ సృజన్ బాబు తెలిపారు.

గ్రంథాలయాలు సద్వినియోగం చేసుకోండి

పావగడ: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని మున్సిపల్ చైర్మన్ రాజేశ్ విద్యార్థులకు సూచించారు. స్థానిక సర్వజన గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన గ్రంథాలయ వారోత్సవాల వేడుకల్లో ఆయన పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

భక్తిశ్రద్ధలతో నగర సంకీర్తన

హిందూపురం: కిరికెర పంచాయతీ ఐటీ కాలనీలో సద్గురు యోగినారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో గోమాత పూజలు, కైవారం తాతయ్య ఉత్సవమూర్తికి పూజలు చేసి నగర సంకీర్తన చేశారు. కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



అమరాపురం: నృత్యం చేస్తున్న గొరవయ్యలు

ఘనంగా భక్త కనకదాసు జయంతి

రొద్దం/అమరాపురం: రొద్దం మండల పరిధిలోని కోగిరతో పాటు అమరాపురం మండల కేంద్రంలో కురుబల ఆరాధ్యదైవం భక్త కనకదాస జయంతి వేడుకలను ఆదివారం కురుబలు ఘనంగా నిర్వహించారు. కనకదాసు చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున జ్యోతులు మోసం కలశాలను సమర్పించారు.



రొద్దం మండలం కోగిరలో కలశాలు మోస్తున్న మహిళలు